ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 19.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధుల బృందం బయలుదేరి వెళ్లింది.
2. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల పరిధిలో మహిళా స్వశక్తి సంఘాలకు 5 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
3. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను తయారు చేయడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీసీ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.
4. మహిళల స్వావలంబన ద్వారా రాష్ట్రం అభివృద్ధి దిశగా పురోగమిస్తోందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

-----------------------------

**దావోస్ పర్యటన**

ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు బయలుదేరి వెళ్లింది. రేపటి నుంచి నాలుగు రోజులపాటు దావోస్ లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి, ప్రముఖ కంపెనీల సీఈఓలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు. దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేల్స్ ఫోర్స్,

యూనిలీవర్, హనీవెల్, ఎల్ఓరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డీపి వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో రేవంత్ రెడ్డి విడివిడిగా భేటీ అవుతారు. పలు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. దావోస్ వెళ్లిన వారిలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

**జీఎస్**

-----------------------------

**భట్టి విక్రమార్క**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల పరిధిలో మహిళా స్వశక్తి సంఘాలకు 5 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు  73 వేల 152 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు ఆయన వెల్లడించారు.  ఖమ్మం జిల్లా వందనంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

**బైట్ భట్టి విక్రమార్క**

**PTC, khammam**

-------------------------

**జూపల్లి కృష్ణారావు**

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీసీ ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు.  మంచిర్యాల జిల్లా చెన్నూర్ లో 47 లక్షల పైచిలుకు వ్యయంతో  నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)కి మరో మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..

**బైట్...మంత్రి జూపల్లి కృష్ణారావు**

**పీటీసీ మంచిర్యాల**

----------------------------

**వాకిటి శ్రీహరి**

మహిళల స్వావలంబన ద్వారా రాష్ట్రం అభివృద్ధి దిశగా పురోగమిస్తుందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వనపర్తిలో ఈ రోజు జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు ఆయన హాజరై స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు,ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

**పీటీసీ – వనపర్తి**

--------------------------

**దామోదర రాజనర్సింహ**

నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ రోజు నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించిన మంత్రి సుమారు 22 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

**బైట్ దామోదర రాజనర్సింహ్**

ఈ కార్యక్రమాలలో ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎంఎల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**PTC - నాగర్‌కర్నూల్**

-----------------------------

**అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

పెద్దపల్లి జిల్లాలోని వివిధ గ్రామాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి  అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ధర్మారంలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ధర్మారం మండలంలో సమ్మక్క సారలమ్మ జాతర జరిగే గ్రామాలకు నలుగురు పంచాయతీ కార్యదర్శులను ఇంచార్జిలుగా నియమించామన్నారు.

**పీటీసీ - పెద్దపల్లి**

-----------------------------

**సర్వ భాషా కవి సమ్మేళనం:**

గణతంత్ర దినోత్సవం సంధర్బంగా ఆకాశవాణి ఏటా నిర్వహించే సర్వ భాషా కవి సమ్మేళనం ఈ సాయంత్రం హైదరాబాద్ లోని  తెలుగు విశ్వవిద్యాలయం సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో జరుగుతుంది.  22 భారతీయ భాషలల్లో ఎంపిక చేసిన ఉత్తమ, సమకాలీన కవితలను ఆయా భాషల కవులు ఒకే వేదిక పై అలపించే అరుదైన కార్యక్రమం సర్వ భాషాకవి సమ్మేళనం. ఈ కవి సమ్మేళనంతో 1956 నుంచి జాతీయ సమైక్యత, భాషా సామరస్యం, సృజనాత్మకతలను ఆకాశవాణి ఒకే వేదిక పై అందిస్తోంది.  డిల్లీలో జరిగిన జాతీయ సర్వభాషా కవి సమ్మేళనంలో తెలుగు కవి నందిని సిధారెడ్డి పాల్గొని "మెర్సీ వాల్" కవితను వినిపించారు. కాగా, 22 కవితల హిందీ అనువాద కవిత్వాన్నీ, వివిధ ప్రాంతీయ భాషలలోకి అనువాదం చేసిన ప్రాంతీయ భాషా అనువాద కవులు ఈనాటి  సర్వ భాషా కవిసమ్మేళనం లో పాల్గొంటారు. ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ఆచార్య వెలుదండ నిత్యానంద రావు కార్యక్రమంలో పాల్గొంటారు.

**MSL**

-------------------------------

**ఈటల రాజేందర్**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవరం, లక్ష్మాపూర్, అనంతారంలలో పలు అభివృద్ధి పనులకు మల్కాజ్ గిరి పార్లమెంట సభ్యులు ఈటల రాజేందర్ ఈ రోజు శంకుస్థాపనలు చేశారు. కేశవరంలో 36 లక్షల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు, లక్ష్మాపూర్ లో కోటి రూపాయల పైచిలుకు అభివృద్ధి పనులకు, అనంతారంలో 20 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఈటల రాజేందర్ శంకుస్థాపనలు చేశారు.

**జీఎస్**

-------------------------

**ఇస్రో - సాయిచరణ్**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన చొక్కయ్యగారి సాయి చరణ్, దేశంలోని ప్రతిష్టాత్మక ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. చొక్కయగారి శ్రీనివాస్, శివరంజనీల పెద్ద కుమారుడు సాయిచరణ్ విద్యార్థి దశ నుంచే సైన్స్ ప్రయోగాలపై ఆసక్తి కనబర్చేవారు. ఆ దిశగా సాయిచరణ్ ఇటీవల ఇస్రో నిర్వ హించిన రాతపరీక్షలో ప్రతిభ చూపించారు. ఇంటర్వ్యూలో టాప్-3లో నిలిచి శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

---------------------------

**వైజ్ఞానిక ప్రదర్శన 2026**

సంగారెడ్డి జిల్లా కొల్లూరులో దక్షిణ భారత దేశ వైజ్ఞానిక ప్రదర్శన 2026ను టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఈ రోజు ప్రారంభించారు. దీనికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 210 సైన్స్ ప్రదర్శనలు ఎంపికయ్యాయని కలెక్టర్ చెప్పారు.

**SANGAREDDY – PTC**

-----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. రాబోయే రెండు రోజుల్లో అక్కడక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**పీఎస్**

--------------------

**బీజేపీ**

ఈ రోజు ఢిల్లీలో జరిగన భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్ష ఎన్నిక సందర్భంగా నామినేషన్ ప్రక్రియలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ చందర్ రావు, రాష్ట్రానికి చెందిన పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెళ్లారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడిగా నామినేషన్ వేసిన నితిన్ నబీన్ సిన్హాను సమర్థిస్తూ రాష్ట్ర బీజేపీ బృందం కూడా నామినేషన్ పత్రాలను జాతీయ ఎన్నికల అధికారి డాక్టర్ కె. లక్ష్మణ్ కు అందజేశారు. కాగా అధ్యక్ష పదవికి నితిన్ నబీన్ సిన్హా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు.

**డెస్క్**

----------------------------

**సర్పంచులకు శిక్షణ**

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఈ రోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... పంచాయతీ రాజ్ చట్టం ద్వారా సర్పంచ్‌లకు కల్పించిన అధికారాలు, విధులను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని సూచించారు.

**పీటీసీ - సంగారెడ్డి**

-------------------------

**నాంపల్లి గుట్ట**

రాజన్న సిరిసిల్ల జిల్లా నాంపల్లి గుట్టపై  భక్తులకు ఆహ్లాదం పంచేందుకు త్వరలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు చెందిన విమానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, జిల్లా  ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు    జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**పిటిసి - రాజన్న సిరిసిల్ల**

-------------------------

**జంతు గణన**

జాతీయ పులుల గణన కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి ఆసిఫాబాద్ జిల్లాలో 6  రోజుల పాటు జంతు గణన జరుగుతుందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ తెలిపారు. మూడు రోజులపాటు పులులు, చిరుతల వంటి మాంసాహార జంతువుల గణన,, మరో మూడు రోజులు శాకాహార జంతువులతో పాటు, చెట్లు, గడ్డి జాతుల గణన చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 488 మంది ఈ లెక్కింపులో పాల్గొంటున్నట్లు వివరించారు.

**ఆసిఫాబాద్ -  పిటిసి**

---------------------------

**విశ్వనాథ్ కార్తీకేయ బాల్ పురస్కార్:**

ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించి చరిత్ర సృష్టించిన మన రాష్ట్రంలోని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన విశ్వనాథ్ కార్తీకేయకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము క్రీడల విభాగంలో 2025 ప్రధానమంత్రి బాల్ పురస్కారాన్ని ఇటీవల ప్రదానం చేశారు. ఆసియాలోని ఎవరెస్ట్ పర్వతం, ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతం, యూరప్‌లోని ఎల్బ్రస్ పర్వతం, ఉత్తర అమెరికాలోని డెనాలి, దక్షిణ అమెరికాలోని అకాన్‌కాగువా, అంటార్కిటికాలోని విన్సన్ పర్వతం, ఆస్ట్రేలియాలోని కోస్కియుస్కో పర్వత శిఖరాలు ఎక్కిన అతిచిన్న  పిన్న

వయస్కుడైన భారతీయునిగా విశ్వనాథ్ రికార్డు సృష్టించారు. ప్రపంచంలో ఈ విజయాలు సాధించిన చిన్న వయస్కులైన వారిలో విశ్వనాథ్ రెండోవారు కావటం విశేషం. 2020 లో కోవిడ్ మహమ్మారి సమయంలో విశ్వనాద్ 11 ఏళ్ల వయస్సులో పర్వతారోహణ శిక్షణ తీసుకోవడం మొదలు పెట్టాడు. నెహ్రూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌లో ఇంటినుంచే ఐదు నెలల శిక్షణ తీసుకున్నాడు. గతంలో 17 ఏళ్ళ కామ్య కార్తికేయన్ నెలకొల్పిన భారతీయ రికార్డును బద్దలు కొట్టాడు. అసాధారణ ప్రజ్ఞ కనబరిచిన విశ్వనాథ్ పట్టుదల లక్షలాది మంది యువతకు ప్రేరణ.

**MSL**

---------------------